

మినీ అంగన్‌వాడీ టీచర్లకు మెయిన్ టీచర్ల మాదిరిగా జీతాలు ఇవ్వాలని మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

# మినీలకు మొండిచెయ్యేనా?

ఆ 12 నెలల వేతనం హుళక్కేనా?
మంత్రి సీతక్క హామీ అమలు కానట్లేనా?

*కాలయాపనే కాంగ్రెస్ సర్కారు నైజమని, మాట తప్పడం ఆ పార్టీ మేనరిజమని జనం నోళ్లలో నానుతున్న సెటైర్లు వాస్తవ రూపంలోనూ నిజమనే రుజువవుతోంది. ఇది తమ విషయంలో నూరు శాతం యథార్థమేనని మినీ అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. తామే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని చెబుతున్నారు. అధికారంలోకి రాగానే.. మినీ నుంచి మెయిన్‌గా మారిన అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడేషన్ ఉత్తర్వులు జారీ చేస్తామన్న హామీ దగ్గర నుంచి మొదలుకొని 'ఇదిగో.. పెంచిన వేతనాలు ఇస్తున్నాం..' అనే ఆఖరి హామీ వరకూ.. ఇచ్చిన మాటలన్నీ నీటిమూటలేనని తేల్చిచెబుతున్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతున్నట్లు సాక్షాత్తూ సంబంధిత శాఖ మంత్రి సీతక్క పెట్టిన తొలి సంతకం కూడా ఆచరణలో అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోసకారి సర్కారుపై మర్లపడేందుకు మరెన్ని మోసాలు రుజువులుగా కావాలంటూ ప్రశ్నిస్తున్నారు.. మినీ నుంచి మెయిన్‌గా అప్‌గ్రేడ్ అయిన భద్రాద్రి జిల్లా అంగన్‌వాడీ టీచర్లు.*

*-భద్రాద్రి కొత్తగూడెం, మే 21 (నమస్తే తెలంగాణ)*

- ఆమె పెట్టిన తొలి సంతకానికీ తిలోదకమేనా?
- సందేహాల సుడిలో మినీ అంగన్‌వాడీలు
- మాట తప్పే సర్కారుపై ఆదినుంచీ అనుమానాలే
- కాలయాపనే నైజంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన
- పెంచిన ఏప్రిల్ వేతనమూ కొన్ని జిల్లాల్లోనే జమ
- ఇందులోనూ భద్రాద్రి 'మినీ'లకు నిరాశే..



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో టీచర్



పిల్లలకు భోజనం సిద్ధం చేస్తున్న టీచర్

మినీ అంగన్‌వాడీల ప్రాధాన్యాన్ని గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. వాటిని మరింత బలోపేతం చేసేందుకు అప్పట్లోనే కీలక నిర్ణయం తీసుకుంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా, వాటిల్లో పనిచేసే మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియ జరుగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కేవలం మినీలను మెయిన్‌లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపుకుంది. మెయిన్ అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా మినీ అంగన్‌వాడీలకూ వేతనాలు పెంచుతూ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పెట్టిన తొలి సంతకం కూడా ఆచరణకు నోచుకోలేకపోయింది. దీంతో 12 నెలలుగా మినీ అంగన్‌వాడీ టీచర్లు హైదరాబాద్ చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయారు. పెంచిన వేతనాలు అందించాలని కోరుతూ మంత్రి సీతక్కకు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చీ ఇచ్చీ విసిగిపోయారు. ఈ ఏడాది కాలంగా సగం వేతనంతో సర్దుకొని కుటుంబాలను వెళ్లదీసుకుంటూ వచ్చారు. ఇదే సమయంలో తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నాలు, రాస్తారోకోల వంటి ఆందోళన కార్యక్రమాలూ నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో మరోసారి రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారు.

## మూడు నెలలే జమ చేసి మురిపించారు..

అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్న గొప్పను చెప్పుకోవడం కోసం కాంగ్రెస్ సర్కారు ఎత్తుగడలు కూడా వేసింది. అప్‌గ్రేడ్ చేసిన తొలినాళ్లలో అంటే నిరుటి జనవరి, ఫిబ్రవరి నెలలు, ఈ ఏడాది ఏప్రిల్ నెల మాత్రమే పెంచిన వేతనాలను ఖాతాల్లో జమ చేసింది. అయితే, ఈ ఏప్రిల్ నెల పెరిగిన వేతనాలు కూడా కేవలం 10 జిల్లాలకే జమ చేసినట్లు మినీ అంగన్‌వాడీలు చెబుతున్నారు. ఇంకా 23 జిల్లాలకు జమ చేయలేదని, అందులో భద్రాద్రి జిల్లాకు కూడా జమ చేయలేదని చెబుతున్నారు. అయితే, వెనుకాముందుగా ఈ ఏప్రిల్ నెల వేతనం జమ చేసిన పక్షంలో మరి గత 12 నెలల వేతనం మాటేమిటని మినీ అంగన్‌వాడీలు ప్రశ్నిస్తున్నారు. తమ ఏడాది రెక్కల కష్టం బూడిదలో పోసినట్లేనా అనే సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## 'భద్రాద్రి'లో 626 మంది 'మినీ'లు

ఈ అప్‌గ్రేడేషన్‌లో భద్రాద్రి జిల్లాలోని 626 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లకు లబ్ధి చేకూరలేదు. మినీ టీచర్లకు రూ.7,500, మెయిన్ టీచర్లకు రూ.13,500 చొప్పున వేతనాలు చెల్లించేవారు. 12 నెలల క్రితం మినీలను మెయిన్‌లుగా అప్‌గ్రేడ్ చేయడంతో వారికి అప్పటి నుంచే రూ.13,500 చొప్పున వేతనాలు అందించాల్సి ఉంది. పేరుకు వీరు మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ.. వేతనం రూ.7,500 చొప్పునే పొందుతున్నారు. కానీ.. హెల్పర్లు కూడా లేకపోవడంతో ఇటు ఆయాలుగానూ, అటు టీచర్లుగానూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. పైగా ప్రభుత్వం అప్పగించే వివిధ సర్వేలు సహా ఇంకొన్ని అదనపు పనులనూ భుజాన వేసుకోవాల్సి వస్తోంది.

### అప్‌గ్రేడ్ చేశారు.. వేతనాలు ఇవ్వడం లేదు..



మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ఎప్పుడో అప్‌గ్రేడ్ చేశారు. తరువాత మూడంటే మూడు నెలలు మాత్రమే మెయిన్ టీచర్లతో సమానమైన రూ.13,500 వేతనం ఇచ్చారు. మళ్లీ గడిచిన 12 నెలలుగా మినీలకు ఇచ్చే రూ.7,500 వేతనాన్నే ఇస్తున్నారు. ఈ ఏప్రిల్ నెల నుంచి కొత్త జీతం వస్తుందని అన్నారు.

**–పరిసిక వెంకటరమణ, భద్రాచలం**

### అనేక కష్టాలు పడుతున్నాం..



హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మా మినీ అంగన్‌వాడీలకు ఎంతో మేలు చేస్తుందని అనుకున్నాం. చిన్నచూపు, అదనపు భారాలు తప్ప ఏమీ లేదు. మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ఉన్నతీకరించి ఏడాది అవుతోంది. ఇంత వరకూ అందుకు తగ్గ వేతనాలే ఇవ్వడంలేదు.

**–చంద్రకళ, మణుగూరు**

### ఏప్రిల్ నుంచి కొత్త జీతాలు వస్తున్నాయి..



గత నెల నుంచి పెంచిన వేతనం వస్తోందని తెలిసింది. గతంలో ఫైనాన్షియల్ అప్రూవల్ కాకపోవడం వల్ల ఇబ్బంది వచ్చింది. ఇప్పుడు ఆ సమస్య తొలగిపోయింది. కొన్ని జిల్లాల్లో ఏప్రిల్ నెల నుంచి పెరిగిన వేతనాలు జమ అవుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో కూడా జమ అవుతాయి. పెండింగ్ వేతనాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

**–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమాధికారి**

# నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 38 కేంద్రాలు, రెండు సెషన్లలో పరీక్ష నిర్వహణ
- ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం అర్బన్, మే 21 : జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈసారి ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు కూడా ఉన్నారు. రెండు సెషన్లలో నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లాలో 38 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించి పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన జాగ్రత్తల గురించి వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆదివారం సైతం పరీక్ష నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం జనరల్‌లో 9,204 మంది, ఒకేషనల్‌లో 673 మంది, బ్యాక్‌లాగ్ 1,903 మంది.. మొత్తం 11,780 మంది పరీక్ష రాయనున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 3,143 మంది, ఒకేషనల్‌లో 538 మంది.. మొత్తం 3,681 మంది పరీక్ష రాయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 15,461 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

## పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

### జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షల నిర్వహణలో కీలకంగా వ్యవహరించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కి సూచించారు. బుధవారం డీఐఈవో కార్యాలయంలో సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో సమావేశం నిర్వహించారు. ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల అంశాలపై సీఎస్, డీవోలతో మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో భాగంగా నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్టోరేజ్ పాయింట్‌గా కేటాయించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ 2 బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్స్ 3 బృందాలు(ఆరుగురు సభ్యులు) ఉండనున్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

మామిళ్లగూడెం, మే 21 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, పరిసరాల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్‌ను అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఐదుగురికి మించి గుంపులుగా ఉండొద్దని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని సూచించారు. కేంద్రాల సమీపంలో ఇంటర్‌నెట్, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం ధర్నా

## నిరుపేదలందరికీ మంజూరు చేయాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చంద్రుగొండ, మే 21 : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, కాంగ్రెస్ నాయకులతో వేసిన ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చంద్రుగొండ తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట నిరుపేదలు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పెద్దిని వేణు, పలువురు నిరుపేదలు మాట్లాడుతూ ఎవరి ప్రమేయం లేకుండా గ్రామాల్లో దరఖాస్తు చేస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేసిన ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు అవినీతికి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నాయని, వెంటనే ఆ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, పేదలు పాల్గొన్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

## ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఎర్రుపాలెం, మే 21 : భూభారతి చట్టంతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మొలుగుమాడు గ్రామంలో భూ సర్వే ప్రక్రియను బుధవారం ప్రారంభించిన కలెక్టర్.. అనంతరం రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోనకల్లు, నేలకొండపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్లను ఏర్పాటు చేసి భూ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. భూ హక్కుల యాజమాన్య ఆర్డర్లను తహసీల్దార్ 30 రోజుల్లో విచారణ చేసి జారీ చేయాలని, లేదంటే ఆటోమేటిక్‌గా దరఖాస్తు ప్రకారం ఆర్డర్ పాస్ అవుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద 5 గ్రామాల్లో ప్రభుత్వం భూ సర్వే చేపడుతుందని, నేడు వ్యవసాయ భూములను మాత్రమే సర్వే చేస్తున్నామని, గ్రామకంఠం, ఇళ్లను సర్వే చేయడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లోని అన్ని సర్వే నెంబర్లు, భూమి అంతటినీ సర్వే చేసి భూముల లెక్క తేల్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఉషాశారద, అధికారులు పాల్గొన్నారు.

## భూ సేకరణ వేగవంతం చేయాలి

### 'సీతారామ' సమీక్షలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 21 (నమస్తే తెలంగాణ) : సీతారామ ఎత్తిపోతల పథకం కెనాల్ భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ కెనాల్ భూ సేకరణపై ఇరిగేషన్, సర్వే అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. భూ సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లోగా గ్రామసభలు పూర్తి చేయాలన్నారు. కాల్వల ఏర్పాటుతో రైతులకు భూమి విలువ పెరుగుతుందనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేయర్లకు అవసరమైతే ఆధునిక యంత్ర పరికరాలు, ల్యాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. ఆధునిక పద్ధతులు అవలంబించి వేగవంతంగా భూ సర్వే పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కాశయ్య, సుమ, ఇరిగేషన్ శాఖ ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు అర్జున్‌రావు, సురేశ్‌కుమార్, అశ్వారావుపేట, ఇల్లెందు ఈఈ చారి, డీఈలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## విద్యారంగంలో జిల్లాను ముందుంచాలి

### భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 21 : విద్యారంగంలో జిల్లాను ముందుంచేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంతో పాటు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల నమోదు పెంచడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని విద్యారంగం డిజిటలీకరణ వైపు సాగుతున్నదని, విద్యారంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు ఆకలింపు చేసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం సమన్వయకర్త నాగరాజశేఖర్, ఆర్పీలు ఆనందకుమార్, మీరా సాహెబ్, విజయబాబు, బాబులాల్, గెజిటెడ్ హెచ్‌ఎంలు, కేజీబీవీ, యూఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో మాయాజాలం

- తరుగు పేరిట నిర్వాహకుల దోపిడీ యత్నం
- బస్తాకు రెండు కిలోల చొప్పన అదనం
- మరో కిలో తీసేందుకు మిల్లర్ల బలవంతం
- అయినా చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం

*యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ఊదరగొడుతున్నప్పటికీ.. తెరవెనుక మాయాజాలం భారీగానే జరుగుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తరుగు పేరిట దోపిడీ యత్నం చేస్తుండడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. బస్తాకు రెండు కిలోల చొప్పున అదనంగా తరుగు తీస్తుండడంతో అన్నదాతలకు మిగిలేదేమీ లేకుండా పోతోంది. అయినప్పటికీ చోద్యం చూస్తున్న ప్రభుత్వం.. కనీస చర్యలకు చొరవ తీసుకోకపోవడం గమనార్హం. – చుంచుపల్లి, మే 21*



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని తూకం వేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చుంచుపల్లి మండలంలోని సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన పెనగడప, అంబేద్కర్‌నగర్, చుంచుపల్లి తండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు అదనంగా రెండు కిలోల చొప్పున ధాన్యాన్ని తూకం వేస్తున్నారు. 42 కేజీల 200 గ్రాములు తూకం వేస్తున్నారు. అయితే, కాంటా పెట్టి మిల్లర్ల వద్దకు పంపగా మిల్లర్లు వడ్లు మొలకెత్తాయని కొర్రీలు పెట్టి దానిలో సైతం కేజీ తరుగు తీస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు. లేదంటే కొనుగోళ్లకు ససేమిరా అంటున్నట్లు చెబుతున్నారు. ధాన్యం దోపిడీకి రైతులు ఒప్పుకోకపోతే కొనుగోలు కేంద్రం నిర్వాహకులు బలవంతంగానైనా దోపిడీకి పాల్పడుతున్నారు. వడ్లు పచ్చిగా ఉన్నాయంటూ కొర్రీలు పెడుతున్నారని, తూకం వేయడానికి ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన తొలిరోజు నుంచే ఈ తరహా చర్యలు వెలుగుచూడడం గమనార్హం.

### కొనుగోలు కేంద్రాల్లో తరుగు దోపిడీ..

యాసంగి పంట సేకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారు. రైతులకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా, ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పంటను విక్రయించుకునేందుకు రైతులు ధాన్యం తీసుకురాగా.. తరుగు పేరిట కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దోచుకుంటున్నారు. క్వింటాలు ధాన్యానికి సుమారు రెండు కిలోల వరకు తరుగు పేరిట అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. ఈ దోపిడీని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కూడా జరుగుతున్నాయి. దీంతో ఈ నిరసనలు ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్నాయి.

### రైస్ మిల్లర్ల సిండికేట్..

మండలంలోని పెనగడప, అంబేద్కర్‌నగర్, చుంచుపల్లి తండా పంచాయతీల్లో కొత్తగూడెం సహకార పరపతి సంఘం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇటీవల కలెక్టర్ కూడా ఈ కేంద్రాలను పరిశీలించారు. తరుగు రూపంలో 2, 3 కేజీలు అధికంగా తీసుకోవద్దని మీటింగ్ పెట్టి మరీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. అయినా సొసైటీ బాధ్యులు ఖాతరు చేయడం లేదు. 42 కేజీల 200 గ్రాములు అయితేనే తీసుకుంటామని రైతులకు సొసైటీ అధికారులు స్పష్టం చేస్తుండడంతో చేసేదిలేక దిక్కుతోచని స్థితిలో అమ్ముతున్నారు. తరుగు దోపిడీకి రైస్ మిల్లర్లు, సొసైటీల బాధ్యులు సిండికేట్‌గా మారారు. అంతా కలిసి ఒక నిర్ణయం తీసుకొని రైతులను నిండా ముంచుతున్నారు. గతంలో మాదిరిగానే బహిరంగంగానే 40 కిలోల బస్తాకు 2 నుంచి 4 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. సన్న వడ్ల సాగు సుమారు 70 శాతం వరకు పెరిగింది. యాసంగిలో వచ్చే ధాన్యాన్ని మర ఆడిస్తే బియ్యంలో నూకలు ఎక్కువగా వస్తాయి. ఇదే సాకును బూచిగా చూపి రైస్ మిల్లర్లు దోపిడీకి తెగబడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి రైతులకు చెల్లింపులు జరిగేలా వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. క్వింటాలు ధాన్యానికి సుమారు 5 నుంచి 6 కిలోల వరకు తరుగు పేరిట పక్కాగా దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా చూస్తూ దానికి పరోక్షంగా సహకరిస్తోంది.

### దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ధాన్యం రైతులను వ్యాపారులు, దళారులు కూడా నిలువునా దోచేస్తున్నారు. పెనగడప పంచాయతీలో 147 ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు 3,500 నుంచి 4,000 క్వింటాళ్ల ధాన్యాన్ని దళారులు తీసుకెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. పెనగడపలో సొసైటీ బాధ్యులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. అక్కడ ఎటువంటి ఏర్పాట్లు చేయకపోగా పంట సాగును దూర ప్రాంతమైన చుంచుపల్లితండా, పెనగడప ప్రాంతాలకు ధాన్యం తీసుకెళ్లి విక్రయించాల్సి ఉంటుంది. ఇది వ్యయప్రయాసలతో కూడుకొని ఉండడంతో రైతులు పంట వద్దకు వచ్చే దళారికే విక్రయిస్తున్నారు. యాసంగి పంటను అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నా కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మద్దతు ధర కన్నా తక్కువకే అమ్ముకోవాల్సి వస్తోంది. క్వింటాకు రూ.2 వేలలోపే చెల్లిస్తున్నారు.

### బస్తాకు 3 కేజీల తరుగు తీస్తున్నారు..



కలెక్టర్ వచ్చి మీటింగ్ పెట్టారు. తరుగు తీయవద్దని చెప్పారు. కానీ.. సొసైటీ బాధ్యులు బస్తాకు రెండు నుంచి మూడు కేజీల తరుగు తీస్తున్నారు. మిల్లర్ల దోపిడీపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందో చెప్పాలి? ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులకు అన్యాయం జరిగినా పట్టించుకోవడంలేదు. వడ్లను తూర్పార పట్టినప్పటికీ కొర్రీలు పెడుతున్నారు.

**–గంప అచ్చయ్య, రైతు, పెనగడప**

### కేంద్రం వైపు కన్నెత్తి చూడడం లేదు..



కొనుగోలు కేంద్రాల్లో ఏం జరుగుతుందో కనీసం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. తరుగు పేరుతో బస్తాకు అదనంగా రెండు కేజీలను ఇక్కడ సొసైటీ అధికారులు తూకం వేసి మిల్లర్లకు పంపిస్తున్నారు. మిల్లర్ల వద్దకు వడ్లు పోయాక వడ్లు బాగాలేవని, మొలకెత్తాయని కొర్రీలు పెడుతున్నారు. అక్కడ మిల్లర్లు కూడా బస్తాకు కేజీ వరకూ తగ్గించారు.

**–ఎస్‌కే అహ్మద్, కౌలు రైతు, పెనగడప**